- కోరాడ కాలనీ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ
- గడువు తీరిన చిక్కీలపై ఆగ్రహం.. హెచ్ఎంకు షోకాజ్ నోటీసు

# పిల్లలతో నేలపై కలెక్టర్ భోజనం

నవతరం-హిరమండలం

మండలంలోని కోరాడ కాలనీ (సుబలాయి పునరావాస కేంద్రం) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, ప్రజల భాగస్వామ్యంతో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల భవన నిర్మాణ పనులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి నేలపై కూర్చుని మధ్యాహ్న భోజనం చేశారు. స్వయంగా తన ప్లేటును తానే శుభ్రం చేసుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారు. మెనూ ప్రకారం అందిస్తున్న గుడ్డు కూర, అన్నం రుచిగా ఉన్నాయని వంట ఏజెన్సీని అభినందించారు.





భోజనం అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న వేరుశనగ చిక్కీలను కలెక్టర్ పరిశీలించారు. ఈ క్రమంలో ఒక ప్యాకెట్ గడువు తీరిపోయినట్లు గుర్తించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం వహించినందుకు గాను పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు కె. ఎస్తేర్ రాణికి అక్కడికక్కడే షోకాజ్ నోటీసు జారీ చేశారు. స్టాక్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి, గడువు తీరని పదార్థాలనే పిల్లలకు అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

**మౌలిక వసతులకు పెద్దపీట**

పాఠశాల ఆవరణ పరిశుభ్రతను మెరుగుపరిచేందుకు లక్ష రూపాయలు, అలాగే భద్రతా పరంగా ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా సీసీ కెమెరాల ఏర్పాటు కోసం రూ. 25 వేల నిధులను మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. ఈ నిధులను తక్షణమే ప్రధానోపాధ్యాయులకు అందజేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట పలువురు మండల స్థాయి అధికారులు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

నవతరం
RNI NO. APTEL/2014/58326
తెలుగు దినపత్రిక
సంపుటి : -13 సంచిక : 118 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
07-03-2026 శనివారం వెల : 1/- పేజీలు : 4

# క్షమాపణ చెప్పాకే రాజకీయాలు చేయాలి!

- నాగేంద్రబాబు ముందుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్
- ఎచ్చెర్ల సీటు కేటాయింపుపై కూటమిపై విమర్శలు
- జిల్లాలో కాపు సామాజిక వర్గానికి అన్యాయం జరిగిందన్న ఆరోపణ
- గ్రామాల వారీగా ప్రజల్లోకి వెళ్లనున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం
- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు మెంటాడ స్వరూప్ విమర్శలు
- గోర్లే కిరణ్ నాయకత్వంలో ఉద్యమానికి సిద్ధం

(నవతరం ఎచ్చెర్ల)



శ్రీకాకుళం జిల్లా రాజకీయాల్లోకి అడుగుపెట్టే ముందు నాగేంద్రబాబు మరియు కూటమి నాయకులు ముందుగా ప్రజలకు క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు మెంటాడ స్వరూప్ డిమాండ్ చేశారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నుంచి వలసలను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో ఆయన తీవ్ర విమర్శలు చేశారు.
జిల్లాలో మొత్తం 10 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా అందులో కనీసం ఐదు నియోజకవర్గాలు కాపు సామాజిక వర్గానికి రావాల్సిన న్యాయం ఉందని పేర్కొన్నారు. అయితే రాజాం, పాలకొండ నియోజకవర్గాలు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల కారణంగా పోటీకి అందుబాటులో లేవని తెలిపారు. అమదాలవలసలో కాపు, కళింగ వర్గాలు సమానంగా ఉన్నప్పటికీ సంప్రదాయం ప్రకారం కళింగ సామాజిక వర్గం పోటీ చేస్తోందన్నారు. దీంతో ఎచ్చెర్ల, పాతపట్నం నియోజకవర్గాలు కాపు సామాజిక వర్గానికి రావాల్సిన పరిస్థితి ఉందని చెప్పారు. కానీ గత ఎన్నికల్లో కూటమి నాయకులు ఎచ్చెర్ల సీటును స్థానికంగా బలం లేని వర్గానికి కేటాయించి కాపు సామాజిక వర్గానికి అన్యాయం చేశారని విమర్శించారు.
ఈ అంశంపై నాగేంద్రబాబు మరియు కూటమి నాయకులు ముందుగా క్షమాపణ చెప్పి తరువాతే జిల్లాలో రాజకీయాలు చేయాలని మెంటాడ స్వరూప్ స్పష్టం చేశారు.
రాబోయే రోజుల్లో గోర్లే కిరణ్ నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం గ్రామాల వారీగా ప్రజల్లోకి వెళ్లి ఈ విషయాన్ని విస్తృతంగా తీసుకెళ్తామని తెలిపారు.

# ప్రారంభమైన ప్రతిష్టా మహోత్సవాలు

- శోభాయమానంగా శోభయాత్ర
- ఆకట్టుకున్న కోలాటం...
- శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు
- పాల్గొన్న ప్రముఖులు

2లో





# వాయుసేనలో కొలువులకు 'అగ్నివీర్' గర్జన

- గుంటూరులో 9, 12 తేదీల్లో రిక్రూట్‌మెంట్ ర్యాలీ
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్




నవతరం - శ్రీకాకుళం

భారత వాయుసేనలో అగ్నివీర్ వాయు పోస్టుల భర్తీకి నిర్వహించనున్న ఓపెన్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిరుద్యోగ యువతకు ఒక సువర్ణావకాశమని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9, 12వ తేదీల్లో గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికగా ఈ ఎంపిక ప్రక్రియ జరగనుంది. అభ్యర్థులు ముందస్తుగా ఎలాంటి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, అర్హత కలిగిన వారు నేరుగా ర్యాలీకి హాజరుకావచ్చని ఆయన పేర్కొన్నారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 6 గంటల నుండి 10 గంటల లోపు అభ్యర్థులు రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.
ఈ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా మార్చి 9న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన మహిళా అభ్యర్థులకు, మార్చి 12న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పురుష అభ్యర్థులకు ఎంపికలు నిర్వహిస్తారు. అభ్యర్థులు 02.07.2005 నుండి 02.01.2009 మధ్య జన్మించి ఉండాలని, కనీసం 152 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలని కలెక్టర్ వివరించారు.

-మిగతా 2లో

# అంగరంగ వైభవంగా ఇచ్ఛాపురం వైఎస్ఆర్సిపి కార్యాలయం ప్రారంభోత్సవం

- ఇచ్ఛాపురం వైయస్సార్సీపీ శ్రేణులకు దిశ దశ నిర్దేశం చేసిన పార్టీ పెద్దలు ధర్మాన కృష్ణ దాస్, డాక్టర్ సీదిరి అప్పలరాజు, తమ్మినేని సీతారాం
- పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి భారీగా తరలివచ్చిన వైయస్సార్సీపి శ్రేణులు

3లో



# "ఈ నారి" శిక్షణ పేరుతో నిధులు స్వాహా



- వెలుగు ఉద్యోగుల అవినీతి బాగోతం
- చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల డిమాండ్
- ఈ నారిలకు కొరవడిన శిక్షణ

2లో



ఎడిటోరియల్

# పారిశ్రామికోత్పత్తి క్షీణత


కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపి) వివరాలు తీవ్ర నిరాశ కలిగిస్తున్నాయి. ఈ ఏడాది జనవరిలో పారిశ్రామికోత్పత్తి వృద్ధి రేటు 4.8 శాతానికి పడిపోవడం మాత్రమే కాదు, తయారీ రంగం మైనస్‌లోకి జారడం మరింత ఆందోళనకరం. ఇది గత మూడు నెలల్లో కనిష్ట స్థాయి కావడం పరిస్థితి తాత్కాలికం కాదనే సంకేతాన్ని ఇస్తోంది. ”భారత్ ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ” అని మోడీ సర్కార్ ప్రకటనలు ఉత్తి మాటలేనని క్షేత్రస్థాయి గణాంకాలు కళ్లెదుట చూపుతున్నాయి. దీర్ఘకాల ధోరణులను అర్థం చేసుకునేందుకు పారిశ్రామిక ఉత్పత్తి గణాంకాలు దోహదం చేస్తాయి. ఈ గణాంకాల్లో అన్నీ ప్రతికూలం కాకపోయినా దృష్టి సారించాల్సిన అంశాలు ముఖ్యమైనవి ఉన్నాయి. తయారీ రంగం గతేడాది జనవరిలో ఉన్న 5.8 శాతం వృద్ధి రేటు నుంచి ఈ ఏడాది జనవరిలో 4.8 శాతానికి పడిపోయింది. మైనింగ్ రంగం కూడా గతేడాది 4.4 శాతం ఉండగా స్వల్పంగా తగ్గి 4.3 శాతానికి పరిమితమైంది. తయారీ రంగమే ఉపాధి సృష్టికి ప్రధాన ఆధారం. అదే రంగం క్షీణించడం అంటే చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఒత్తిడిలో ఉన్నాయనే అర్థం.

సూచీలో కొలవబడిన 23 ప్రధాన తయారీ ఉపరంగాలలో ముఖ్యమైన రంగాలు గత సంవత్సరం నుంచే క్షీణతను నమోదు చేశాయి. కార్మిక ఆధారిత రంగాలైన దుస్తులు, వస్త్ర, చర్మ, రబ్బరు, ప్లాస్టిక్ ఉత్పత్తులన్నీ సెప్టెంబర్ 2025 త్రైమాసికంలో కుదించుకుపోయాయి. విద్యుత్ ఉత్పత్తి మెరుగుపడటం కొంత సానుకూలాంశం. అయితే సాధారణ ప్రజలు వినియోగించే వస్తువుల విభాగం మైనస్ క్షీణతను నమోదు చేసిందంటేనే కొనుగోలు శక్తి ఏ రకంగా తగ్గిందో అర్థమవుతోంది. అదేవిధంగా పెట్టుబడి వస్తువుల వృద్ధి కూడా పడిపోయింది. మొత్తంమీద పారిశ్రామిక వాతావరణం మందగించింది. అమెరికా చేస్తున్న సుంకాల యుద్ధం ప్రభావంతో మన దేశం నుండి ఎగుమతుల తగ్గుదల పారిశ్రామిక ఉత్పత్తిపైనా ప్రతికూల ప్రభావం చూపిందని స్పష్టమవుతోంది. అమెరికాతో భారత్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలతో రాబోవు కాలంలో ఈ రంగాలు మరింత క్షీణించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. వస్త్ర పరిశ్రమ దెబ్బతింటుంది. డిసెంబర్‌తో పోలిస్తే ఒక్క నెలలోనే వృద్ధిరేటు పడిపోవడం అంటే రాబోవు మూడు నెలల జీడీపీ అంచనాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంటుందని ఆర్థిక నిపుణుల విశ్లేషణ.

బీజేపీ ప్రభుత్వం పదేపదే అమృతకాలం, విశ్వగురు, భారత్ ఐదు ట్రిలియన్ ఎకానమీ లక్ష్యాలను ప్రచారం చేస్తోంది. విదేశీ పెట్టుబడులు వస్తున్నాయనీ, స్టాక్ మార్కెట్ రికార్డులు బద్దలవుతున్నాయని గ్లోబెల్స్ ప్రచారం చేస్తోంది. కానీ, స్టాక్ మార్కెట్ లాభాలు కొద్దిమంది కార్పొరేట్లకే పరిమితమవుతుంటే, ఉత్పత్తి రంగం క్షీణత సాధారణ ప్రజల జీవితాలపై నేరుగా ప్రభావం చూపుతున్నది. తయారీ రంగం మైనస్‌లోకి జారడంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలహీనపపడింది. వ్యవసాయరంగంలో కార్పొరేటీకరణ పెరిగి కనీస మద్దతు ధరలపై అనిశ్చితి ఏర్పడింది. ఉపాధి కరువైంది, కొనుగోలు శక్తి పడిపోయింది. నిరుద్యోగం పెరుగుతోంది. చిన్న పరిశ్రమలకు రుణాల కొరత, పెరుగుతున్న దిగుమతుల ఫలితంగా పరిశ్రమల్లో ఉత్పత్తి రోజురోజుకు క్షీణిస్తోంది. పదేండ్ల కాలంలో కేంద్రం ప్రభుత్వరంగ సంస్థల్లో ప్రయివేటీకరణను వేగవంతం చేసింది. ముఖ్యమైన రంగాల్లో ప్రభుత్వ వాటాలను తగ్గిస్తూ పోతున్నది. దీనివల్ల పెట్టుబడులు పెరుగుతాయని ప్రభుత్వం వాదించినా, ఉపాధి భద్రత లేకుండా పోతున్నది.

కొన్ని రంగాల్లో సానుకూల వృద్ధి ఉన్నా విస్తృతంగా అన్ని రంగాల్లో జరగడం లేదు. కొన్ని పరిమిత రంగాల్లో మాత్రమే కేంద్రీకృతమై ఉంది. కలప, ఖనిజ, ప్రాథమికలోహాలు, లోహ ఉత్పత్తి తయారీ రంగాలు వృద్ధి సాధించాయి. అయితే అవన్నీ అధిక పెట్టుబడి ఆధారిత రంగాలు. వీటివల్ల జనాలకు ఉపయోగపడేది ఏమీ ఉండదు. ఉప్పు, వంట నూనెలు వంటి నిత్యావసర సరుకుల వినిమయమూ తగ్గిపోతోంది. ఇదే క్రమం కొనసాగితే...? ప్రజల కొనుగోలు శక్తిలేక సరుకులకు డిమాండ్ మందగించడంతో వస్తూత్పత్తి క్రమంగా క్షీణించే ప్రమాదముంది. అది మరింతగా ఉపాధిని దెబ్బతీస్తుంది కనుక ఆర్థిక సంక్షోభం నానాటికీ తీవ్రమౌతోంది. పాలకులు అనుసరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాల దుష్ఫలితమిది. సాక్షాత్తూ కేంద్రప్రభుత్వ మంత్రిత్వ శాఖలు విడుదల చేసిన గణాంకాల అద్దంలో చూసుకొనైనా ఏలినవారు తమ తప్పు తెలుసుకొని దిద్దుకోవాలి. ఈ స్థితిని మార్చడానికి నిజమైన పరిష్కారం ప్రజల ఆదాయాలను పెంచడం, చిన్న పరిశ్రమల ఏర్పా టుకు ఊతమివ్వడం, కొత్త ఉద్యోగాలను సృష్టించడం. అంతేకాదు, ప్రజారంగ పెట్టుబడులు పెంచి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ముఖ్యం. ఆ దిశగా ప్రభుత్వ విధానాలు మార్చేందుకు ప్రజాఉద్యమాలు ఉధృతం కావాలి.

# కర్ణాటక రాష్ట్రంలోని.... గోమతేశ్వరుని మహామస్తకాభిషేకం





పన్నెండు సంవత్సరాల కొక పర్యాయం ఒక నిర్ణీతమైన రోజున, మంగళప్రదమైన ‘ శు భసమయంలో బాహుబలి (గోమతేశ్వరుని) మహామస్తకాభిషేకం దక్షిణ భారతంలోని కర్ణాటక రాష్ట్రంలో ఉన్న శ్రావణబెళగొళలో జరుగుతుంది. బాహుబలి యొక్క బూడిదరంగు నల్లరాతి విగ్రహం ప్రపంచంలోని అతి పెద్ద నిలువెత్తు విగ్రహం. భయభక్తులను ప్రేరేపించే ఈ 1012 ఏళ్ళ విగ్రహం దిగంబర జైనులకు ప్రధాన యాత్రా కేంద్రమైన ఇంద్రగిరి కొండపై ఎండకూ, వానకూ తల వొగ్గి నిల్చి ఉన్నది. తొలి మహామస్తకాభిషేకం 1398 ఏ.డి. లో జరిగినట్లు నమోదయింది. కన్నడ భాషలో ‘బెళగుళం’ అంటే ‘తెల్లని కొలను’ అని అర్థం. పట్టణం మధ్యలో ఉన్న పవిత్ర సరస్సును ఇది సూచిస్తుంది. గొప్ప యోగిపుంగవుడైన శ్రావణుడు ఇక్కడ నివసించేవాడు కనుక ఈ రెండు పేర్లు కలిసి ఈ ప్రదేశం ‘శ్రావణబెళగుళం’ అయింది. సమమైన మైదాన భూమిపై ప్రభవించిన రెండు పర్వతాలు ఇంద్రగిరి, చంద్రగిరి ఈ పట్టణంలో ఉన్నాయి. కటాక్షించే పొడుగైన బాహుబలి విగ్రహం ఇంద్రగిరి పర్వత శిఖరంపైన నిల్చి ఉంటుంది. ఈ కొండ యొక్క రాతి ఉపరి భాగాన్ని 500 మెట్లుగా చెక్కి, అనేక కమానుల ద్వారా 470 అడుగుల ఎత్తుగల శిఖర భాగానికి చేరి విగ్రహ పాద స్పర్శ చేసేందుకు వీలు కల్పించారు.

దాదాపు 982 ఏ.డి.లో ఈ విగ్రహస్థాపన జరిగినట్లు విశ్వసించబడుతున్నది. స్థానిక గాంగ ప్రధాన నాయకుడు, రాచమళ్ళ ముఖమంత్రి అయిన చాముండ రాయని ఆజ్ఞప్రకారం ఒక ఏకశిల నుండి దీన్ని కొండపై చెక్కారు. తాజా కొలతల ప్రకారం బాహుబలి ఎత్తు 58.6 అడుగులు. బ్రహ్మాండమైన పాదాల పొడవు 8 అడుగుల 3 అంగుళాలు. కాలివ్రేళ్ళు 2 అడుగుల 9 అంగుళాలు. బాహుబలి వదన మండలంలో ప్రసరిస్తున్న కరుణ, దయావైఖరి ఎవరినైనా మంత్ర ముగ్ధుల్ని చేస్తుంది.

అయోధ్య పాలకుడైన రిషభుని కుమారులలో బాహుబలి ఒకడు. అతడు, అతని అగ్రజుడు భరతుడు రాజ్యాధికారం కోసం పోరాటం జరుపుకున్నారు. ఈ యుద్ధంలో గెలుపు సాధించిన బాహుబలి రాజ్యాన్ని సోదరుడు భరతునికి అప్పగించి, తపస్సు చేసుకునేందుకు అరణ్యాలకు వెళ్ళాడు.

బాహుబలి మహత్తరమైన నైతిక శక్తి మరియు సదాచారం కల వ్యక్తి. అతని సోదరుడు భరతుడు అతని విగ్రహం నెలకొల్పాడు, కాని అది కాలగర్భంలో కలిసిపోయింది. ఆ తరువాతి సంవత్సరాలలో చాముండరాయడనే వ్యక్తి ఈ కథ విని ఆ స్థలాన్ని గుర్తించలేకపోయాడు. అప్పుడు అతడు చంద్రగిరి కొండ పైనుండి ఒక బాణాన్ని విడిచిపెట్టాడు. అది ఇంద్రగిరి కొండపైన బాహుబలిని ప్రతిబింబిస్తున్న ఒక రాతికి తగిలింది.

ఆ రాతిని చెక్కి తక్షణం బాహుబలి విగ్రహాన్ని తయారు చేయమని అతడు తన శిల్పులను అజ్ఞాపించాడు. వారు కొండపై నుండి పని ప్రారంభించారు– మోకాళ్ళ వరకు వచ్చేసరికి విగ్రహం పూర్తిచేసేందుకు శిల (రాయి) చాలలేదు. లభ్యమైనంతలోనే విగ్రహం పూర్తిచేసేందుకు కాళ్ళను చెక్కవలసి వచ్చింది. అందువల్లనే మోకాళ్ళ క్రింద నుండి విగ్రహం సరైన పాళ్ళ (నిష్పత్తి)లో ఉండదు.

మహామస్తకాభిషేక ఉత్సవ సమయంలో బ్రహ్మాండమైన సరంజాలు విగ్రహం చుట్టూ కట్టబడతాయి. ఒక వేదికపై 108 మంది పూజారులు నిలబడి వివిధ లోహాలతో చేసిన 1008 కలశాలతో పవిత్ర జలాన్ని బాహుబలి మస్తకంపై ప్రోక్షించి అభిషేకిస్తారు. దీని తరువాత పాలు, పుష్పాలు, బంగారం, వెండి, దళాలు, సింధూరం, చందనం మరియు నవరత్నాలతో విగ్రహాన్ని పూజారుల మంత్రోచ్చారణల మధ్య మత నియమానుసారం అభిషేకిస్తారు.


శ్రావణ బెళగొళ బెంగళూరుకు దాదాపు 160 కిలోమీటర్ల దూరంలోనూ మైసూర్ కు 100 కిలోమీటర్ల దూరంలోను ఉన్నది చక్కని కంకర రాతి రోడ్లపై ప్రయాణించి పర్యాటకులు కార్లు పసుల ద్వారా ఈ ప్రదేశానికి చేరుకోవచ్చు.



“ కావ్యసుధ “
‘వాఙ్మయ భూషణ’
“ సాహితీ శిరోమణి “
“ కవన సాగర “
‘ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్’
“ ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ “
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# నిరుద్యోగులకు వరం.. జేఎన్‌టీయూ-జీవీ ‘అవకాశాల పోర్టల్’

**నవతరం - శ్రీకాకుళం**



Phone: Off: 08922 - 294316
Mobile No: 8897344078
Email: registrar@jntugv.edu.in

ECHNOLOGICAL UNIVERSITY-GURAJADA-VIZIANAGARAM
VIZIANAGARAM – 535 003 Andhra Pradesh (India)
(Established by Andhra Pradesh Act No.22 of 2021)

No. JNTUGV/Job Fair 2026/2026 Dt: 24-02-2026

Dr. G. Jaya Suma,
M. Tech. Ph. D
REGISTRAR.

To
The District Collector,
Vizianagaram
Srikakulam
Parvathipuram Manyam
Alluri Seetharama Raju
Visakhapatnam
Anakapalli

Respected Sir,

Sub: Jawaharlal Nehru Technological University Gurajada Vizianagaram – Opportunities Portal – Request for wide circulation – Regarding.
-o0o-

I am are pleased to inform you that JNTU-GV, in association with Nirmaan Organization, has launched the “Opportunities for Unemployed Youth - Portal”, an initiative aimed at empowering unemployed youth through structured employment facilitation, monthly opportunity updates, and periodic skill development programs.

The primary objective of this initiative is to provide continuous career support to unemployed individuals from diverse educational backgrounds including MBA, MCA, M.Pharm, B.Tech, B.Pharm, B.Sc, B.Com, BBA, BBM, Diploma, and ITI (pass or fail). The cell will maintain a dynamic database and provide verified job opportunities every month, along with industry-aligned skill training.

In this regard, I request your good office to kindly extend support by facilitating wide circulation of the enclosed poster across district-level administrative offices, mandal offices, village secretariats, employment exchanges, skill development centres, and other relevant platforms to ensure maximum outreach among unemployed youth.

Your support in disseminating this information will significantly contribute to strengthening employment opportunities and youth empowerment in the district.

Register@ uyopportunities.jntugv.edu.in

REGISTRAR
REGISTRAR
JNTU-GV
VIZIANAGARAM-535003

Copy to
PS to the Hon'ble Vice-Chancellor, JNTUGV

నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు విజయనగరం జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ–జీవీ) నడుం బిగించింది. ‘నిర్మాణ్’ సంస్థతో కలిసి ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లోని యువత కోసం ప్రత్యేకంగా ‘అవకాశాల పోర్టల్’ ను ప్రారంభించింది. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి. జయసుమ ఉత్తర్వులు జారీ చేస్తూ, ఈ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరుతూ విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లకు లేఖ రాశారు. అన్ని విభాగాల వారికీ అవకాశం ఈ పోర్టల్ కేవలం ఇంజినీరింగ్ విద్యార్థులకే పరిమితం కాకుండా.. ఎంబీఏ, ఎంసీఏ, ఎం.ఫార్మసీ, బీటెక్, బీ.ఫార్మసీ వంటి ప్రొఫెషనల్ కోర్సులతో పాటు బీఎస్సీ, బీకామ్, బీబీఏ, బీబీఎం, డిప్లొమా, ఐటీఐ (పాస్ లేదా ఫెయిల్) చదివిన వారందరికీ ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతి నెలా ధ్రువీకరించబడిన ఉద్యోగ అవకాశాల సమాచారాన్ని ఈ పోర్టల్ ద్వారా నిరుద్యోగులకు అందిస్తారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

గ్రామ సచివాలయాలు, మండల ఆఫీసులు, ఉపాధి కార్యాలయాల ద్వారా ఈ పోర్టల్ గురించి యువతకు తెలిసేలా చర్యలు తీసుకుంటున్నట్లు రిజిస్ట్రార్ చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు uyopportunities.jntugv.edu.in వెబ్‌సైట్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.

# “ఈ నారి“ శిక్షణ పేరుతో నిధులు స్వాహా

**నవతరం-మందస**

డేటా ఎంట్రీ లో ఇబ్బంది పడుతున్న ఈ నారి లు... ఈ నారి సి ఆర్ పి ల శిక్షణా నిధులు స్వాహా....? ప్రతి 10 మహిళా సంఘాలకు “మన డబ్బులు మన లెక్కలు” కార్యక్రమం పై ప్రభుత్వం ఒక ఈనారి ను నియమించారు. 25 సంఘాలు పైబడిన గ్రామ సంఘాల్లో అదనంగా ఇద్దరు లైవ్లీవుడ్ సిఆర్పిలను కూడా గుర్తించారు.వీరందరు గ్రామాలలో ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పనిచేస్తూ, సంఘ సభ్యులందరికీ అన్ని ప్రభుత్వ పథకాలపై కూడా అవగాహన కల్పించాలన్నది ఉద్దేశ్యం.. వీరందరికి శిక్షణ ఇచ్చి మహిళా సంఘ సభ్యులు వివరాలు నమోదు చేయాలని సూచించారు. అందుకు గాని సర్వే చేసిన కాలం లో ఒక్కక్క ఈనారి కి రోజుకు 300 రూపాయలు గౌరవ వేతనం ఇవ్వనున్నారు.ఈ విదంగా మందస మండలం లో సుమారు 300 మంది వరకు ఈనారి లను ఎంపిక చేసారు. ఈనారీ సిఆర్పిల శిక్షణ తరగతులు రోజుకు 60 మంది చొప్పున ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించేందుకు స్నాక్స్, భోజనం కొరకు ఒక్కక్కరకి 110 రూపాయలు చొప్పున్న నిధులు మంజూరైనాయి. అయితే ఈనారీ సిఆర్పిలకు శిక్షణా కొరకు మంజూరైనా ఆ నిధులు సంబంధిత వెలుగు కార్యాలయం ఉద్యోగులు స్వాహా చేసినట్లు ప్రచారం జరుగుతుంది. ఏపీఎం కనుసన్నలోనే నిధులు కైంకర్యం జరిగినట్టు మహిళా సంఘాలు ప్రతినిధులు వాపోతున్నారు. శిక్షణ కార్యక్రమం ను పూర్తిగా నీరు గార్చారు. దింతో ఈనారీ సిఆర్పిలకు సరైన శిక్షణ లేక డేటా ఎంట్రీ లో ఇబ్బంది పడుతున్నారు. అంతే కాకుండా సరైన శిక్షణ లేకుండా మహిళా సంఘ సభ్యులు వివరాలు డేటా ఎంట్రీ చేయాలని ఆదేశాలు జారీ చేస్తుండటం తో చాలామంది ఈనారీ సిఆర్పిలు బిక్క మొహం వేస్తున్నారు. దీనిపై అధికారులు పర్యవేక్షణ కూడా లేకపోవడం విశేషం. ఇదిలా ఉంటే ఇంతకు ముందు జరిగిన శిక్షణ కార్యక్రమం లకు సంబందించిన నిధులు కూడా దుర్వినియోగం అయ్యాయన్న ఆరోపణలు వున్నాయి. అదేవిధంగా విలేకరుల పేరుతో విలేకరులకు సంక్రాతి మామ్ముళ్లు చెల్లించాలాంటూ స్త్రీ నిధి దీనికి సంబందించిన నిధులను విత్ డ్రా చేశారన్నా ఆరోపణలు వినిపిస్తున్నాయి. శిక్షణ, సమావేశాల తీరు పై, నిధులు వినియోగం పై దర్యాప్తు జరగాలని, ప్రజలు, మహిళా సంఘాలు కోరుతున్నాయి.

# వాయుసేనలో కొలువులకు ‘అగ్నివీర్’ గర్జన

మొదటిపేజీ తరువాయి

విద్యార్హతల విషయానికి వస్తే.. ఇంటర్మీడియట్ లేదా డిప్లొమా లేదా ఒకేషనల్ కోర్సుల్లో కనీసం 50 శాతం మార్కులు, అలాగే ఇంగ్లీష్ సబ్జెక్టులో తప్పనిసరిగా 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. 49.99 శాతం మార్కులు ఉన్నా కూడా అనర్హులుగా పరిగణిస్తారని ఆయన గుర్తు చేశారు. ర్యాలీకి వచ్చే అభ్యర్థులు తమ వెంట విద్యార్హత ధ్రువపత్రాల ఒరిజినల్స్‌తో పాటు, ఆధార్ కార్డు, డొమిసైల్ సర్టిఫికేట్, ఎన్సీసీ (ఉంటే), 10 పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ప్రతి సర్టిఫికేట్ యొక్క 6 సెట్ల జిరాక్స్ కాపీలను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

దేశ సేవలో భాగస్వాములు కావాలనుకునే ఆసక్తి గల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆకాంక్షించారు.

# ప్రారంభమైన ప్రతిష్టా మహోత్సవాలు

**నవతరం - శ్రీకాకుళం**

నగరంలోని నానుబాలవీధిలో వెలసిన శ్రీ విజయదుర్గా అమ్మవారి ఆలయ పునః ప్రతిష్టా మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యారు. గురువారం సాయంత్రం నగరంలో నిర్వహించిన శోభాయాత్ర మరింత శోభాయమానంగా సాగింది. ప్రముఖ నృత్యదర్శకురాలు, గిన్నీస్‌బుక్ రికార్డు గ్రహీత నీరజ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పదుల సంఖ్యలో కోలాట బృందాలు చేసిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

అనంతరం అమ్మవారిని ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చారు. సోమవారం ఉదయం ఆలయ ప్రధానార్చకులు ఆరవెల్లి సూర్యనారాయణశర్మ ఆధ్వర్యంలో గోపూజ, విఘ్నేశ్వరపూజ, పుణ్యావహచనం, రక్షా సూత్రధారణ, అమ్మవారి విగ్రహానికి జలాధివాసం వంటి విశేష పూజలు నిర్వహించారు.

యాగశాలలో 200 మంది మహిళలతో లలితా సహస్ర నామ పారాయణం నిర్వహించారు. భక్తులు విజయాలు అందించవే విజయదుర్గ అంటూ భక్తితో పూజలు చేశారు.

ఈ పూజా కార్యక్రమాల్లో ఆరవెల్లి చంద్రశేఖరశర్మ, వేమకోటి సూర్యనారాయణశర్మ, చేబ్రోలు రామకుమార్, సుకన్య దంపతులు, చేబ్రోలు విశ్వేశ్వరరావు దంపతులు, సత్య జూయలర్స్ అధినేత దంపతులు, ఊర్వశి ప్రదీప్ దంపతులు, అంధవరపు సంతోష్ తదితరులు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.

# ఓ నవభారత నారీమణి..!

# నమో నమో..!!

ఓ నవభారత నారీమణి...
నీకిదే నా అక్షర
నీరాజనం..!

నిన్న నీవు నిశ్శబ్దంగా
కరిగిపోయే ఓ మధుర
స్వప్నానివి
నేడు అడ్డంకులను
చీల్చుకుంటూ
ఎగిసిపడే సముద్ర
కెరటానివి...

నిన్న మమకారం
పంచే అమ్మవు
నేడు ఆరాధ్యనీయమైన
అనురాగమూర్తివి...

నిన్న పంజరాన
బంధీవైన
వనమయూరానివి...
నేడు వంటగది
సరిహద్దుల్లో
ఒదిగిపోయిన ముగ్ధ
హరిణివి...

నేడు అనంత
విశ్వాన్ని
చుట్టివచ్చే
అశ్వానివి...
నీలాకాశంలో
స్వేచ్ఛగా
విహరించే
విహంగానివి...

అంతరంగాన్ని...
అంతరిక్షాన్ని...
ఏకకాలంలో శోధించే
మేధో శిఖరానివి...

నిన్న ఇంటి ముంగిట
విరిసిన తులసి మొక్కవు...
నేడు కోరిన
వరాలనిచ్చే కల్పవల్లివి...

నిన్న అణచివేతకు
గురైన సాదాసీదా
ఆడపిల్లవు...
నేడు చీకట్లను దహించి
వెలుగులు పంచే
అగ్గిపుల్లవు...

నిన్న సంసార నౌకకు

చుక్కానివి
నేడు వాణిజ్య
సామ్రాజ్యాలను
శాసించే వ్యాపార
ధ్రువతారవు...

నిన్న పలకని
మూగవీణపై మౌన
రాగానివి,
నేడు అన్యాయంపై
గర్జించే విప్లవ
శంఖారావానివి...

నిన్న అబలగా చరమగీతం
పాడి
నేడు అంతరిక్షాన వెలిగే
అగ్నిశిఖవు...
సాక్షాత్తూ ఆదిపరాశక్తికి
ప్రతిరూపానివి..

జయహో...
జయహో...
ఓ నవభారత
నారీమణి..
నీకిదే నా అక్షర
నీరాజనం..!



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

(అంతర్జాతీయ
మహిళా
దినోత్సవం
సందర్భంగా
మహిళామూర్తులకు
శుభాకాంక్షలు)

# ఏప్రిల్ నాటికి వంశధార ఎత్తిపోతల పూర్తి

## జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



**నవతర-హీరమండలం**

గొట్టా బ్యారేజీ వద్ద వంశధార ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేసి, రానున్న ఏప్రిల్ నాటికి పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శుక్రవారం ఆయన హీరమండలం మండలంలో పర్యటించి, జలాశయానికి నీటిని తరలించే ఎత్తిపోతల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పథకానికి సంబంధించిన విద్యుత్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని, జలాశయం భవిష్యత్తులో జిల్లాకే తలమానికంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అంతేకాకుండా, హీరమండలం జలాశయ ప్రాంతాన్ని ఒక అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఆయన వెల్లడించారు.
జలాశయం ద్వారా ఉద్దాన ప్రాంతంతో పాటు పలు నియోజకవర్గాలకు శాశ్వత మంచినీటి పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ ధీమా వ్యక్తం చేశారు.
జల జీవన్ మిషన్ ద్వారా ప్రజలకు మంచినీటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని, దీనివల్ల పాతపట్నం, టెక్కలి, నరసన్నపేట నియోజకవర్గాలకు సాగు, మంచినీటి లభ్యత పెరుగుతుందని వివరించారు.
ఈ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు.

# అంగరంగ వైభవంగా ఇచ్ఛాపురం వైఎస్ఆర్సిపి కార్యాలయం ప్రారంభోత్సవం

- ఇచ్ఛాపురంలో వైయస్సార్ సిపి జెండా ఈసారి ఎగరడం ఖాయం
- టిడిపి కంచుకోట బద్దలు చేస్తాం
- మూడుసార్లు ఎంపీగా చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలి
- సంక్షేమ పథకాలకు కూటమి ప్రభుత్వంలో పాతర
- ప్రశ్నించే ప్రతిపక్షంపై పోలీస్ కేసులతో ఇంకెంతకాలం నిర్బంధిస్తారు
- ప్రజారోగ్యాన్ని పూర్తిగా చంద్రబాబు ప్రభుత్వం విస్మరించింది
- కేంద్ర మంత్రి.. రాష్ట్ర మంత్రి.. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఉద్దానం ప్రాంతానికి ఏం అభివృద్ధి చేశారో చెప్పండి
- పార్టీ కోసం నిలబడి.. కష్టపడి సేవలు అందించిన వారికి ప్రత్యేక గుర్తింపు
- క్షేత్రస్థాయిలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కూటమి తీరును ప్రజలకు వివరించండి
- ఇచ్ఛాపురం వైయస్సార్సీపీ శ్రేణులకు దిశ దశ నిర్దేశం చేసిన పార్టీ పెద్దలు ధర్మాన కృష్ణ దాస్, డాక్టర్ సీదిరి అప్పలరాజు, తమ్మినేని సీతారాం
- పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి భారీగా తరలివచ్చిన వైయస్సార్సీపి శ్రేణులు

**(నవతరం -ఇచ్ఛాపురం - సోంపేట)**

చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని చెప్పడానికి రెడ్ బుక్ రాజ్యాంగం లో ప్రజా వ్యతిరేక విధానాలు నిలదీసే ప్రతిపక్ష నేతలపై కక్షపూరితంగా, అతి దుర్మార్గంగా అక్రమంగా పోలీసు కేసులు బనాయించిన తీరు చూస్తుంటే, దుర్మార్గపు ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపే రోజులు దగ్గర పడుతున్నాయని వైయస్సార్సీపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణ దాస్, రాష్ట్ర మాజీ మంత్రి, వైయస్సార్సీపి డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సిదిరి అప్పలరాజు, రాష్ట్ర మాజీ స్పీకర్ తమ్మినేని సీతా రామ్ లు సంయుక్తంగా పేర్కొన్నారు. శుక్రవారం ఇచ్ఛాపురంలో వైయస్సార్సీపి నూతన కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమం నియోజకవర్గ ఇన్చార్జ్ సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరైన ధర్మాన కృష్ణ దాస్ వైఎస్ఆర్సిపి నూతన కార్యాలయాన్ని నియోజకవర్గ నలుమూల నుంచి వచ్చిన పార్టీ శ్రేణులు హర్షధ్వనాల మధ్య అంగరంగ వైభవంగా ప్రారంభోత్సవం చేశారు. అనంతరం వైయస్సార్సీపీ శ్రేణులను ఉద్దేశించి అతిధులుగా హాజరైన ధర్మాన కృష్ణ దాస్, డాక్టర్ అప్పలరాజు, తమ్మినేని సీతారాం మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం కోసం తాము అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తానని మాయం మాటలతో గద్దెనెక్కిన చంద్రబాబు అదేమీ అమలు చేయకుండా ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, ప్రజలను నిలువునా మోసం చేశారని వారు విమర్శించారు. గత జగనన్న పాలన సంక్షేమ పథకాలతో అభివృద్ధి పరుగులు పెడుతూ ప్రతిరోజు పండగలాగే ఉండేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులు పాలు చేయడమే ఈ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక అజెండాగా కనిపిస్తుందని పార్టీ పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వం లో అమలు చేసిన సంక్షేమ పథకాలను మరింతగా కుదించడమే కాక, అర్హులైన నిరుపేదలకు కొత్త పింఛన్లు కూడా మంజూరు చేయలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని వారు మండిపడ్డారు. వైయస్ఆర్సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలతో పాటు అనేక విప్లవాత్మక సంస్కరణలు పరిపాలనలో తీసుకురావడం జరిగిందని, అందులో భాగంగా గ్రామ సచివాలయాలు, నాడు- నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలను ఆధునికరణ, ప్రభుత్వ ఆసుపత్రులలో అదనపు మౌలిక రంగ సౌకర్యాలు కల్పించబడ్డాయని పార్టీ అగ్రనేతలు స్పష్టం చేశారు. మూడుసార్లు శ్రీకాకుళం పార్లమెంటరీ నుంచి ఎన్నికైన ప్రజా ప్రతినిధి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని, ఇండిగో సంక్షోభం, అహ్మదాబాదులో విమాన ప్రమాదంలో అనేకమంది మృతి, తాజాగా మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి విమాన ప్రమాదంలో మృతి వంటి ఘటనలు జరిగినప్పటికీ, కింజరాపు రామ్మోహన్ నాయుడు తమ వైఫల్యాలను ఒప్పుకోక, తిరిగి భోగాపురం ఎయిర్ పోర్టు కూటమి ప్రభుత్వమే నిర్మించింది అంటూ డప్పులు కొట్టుకోవడం చూస్తుంటే జాలి వేస్తుందన్నారు. జిల్లాలో మూలపేట ఓడరేవు నిర్మాణం, పలాస లో కిడ్నీ రీసెర్చ్ కేంద్రం , 700 కోట్ల రూపాయలతో హిరమండలం నుంచి వంశధార జలాలు ఇచ్ఛాపురం నియోజకవర్గం వరకు శుద్ధి చేయబడిన త్రాగునీరు ఇంటింటికి అందించే డాక్టర్ వైయస్సార్ సుజల ధార ప్రాజెక్టుతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత వైయస్సార్సిపి ప్రభుత్వాని దేనని వక్తలు స్పష్టం చేశారు. ఈసారి ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైయస్సార్సీపీ జెండా ఎగరడం ఖాయమని, తెలుగుదేశం పార్టీ కంచుకోట ను మంచు కోటగా మార్చే దమ్ము, ధైర్యం ప్రతి వైసిపి కార్యకర్త లో కనిపించాలని, పార్టీకి చేసిన సేవలకు తప్పక అధిష్టానం ఈసారి గుర్తిస్తుందని ధర్మాన కృష్ణం దాస్ భరోసా ఇచ్చారు. వైఎస్ఆర్సిపి ఇచ్ఛాపురం నియోజకవర్గం సమన్వయకర్తగా సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి మంచి యువకుడని, ఆయన నాయకత్వాన్ని వైఎస్ఆర్సీపీ శ్రేణులు బలపరిస్తే, కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించే విధంగా కార్యచరణకు వైయస్సార్సీపీ సహకరించాలని ధర్మాన కృష్ణ దాస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇచ్ఛాపురం మున్సిపల్ ఛైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ ప్రతినిధి పిరియ సాయిరాజ్, కవిటి ఎంపీపీ ప్రతినిధి కడియాల పద్మ ప్రకాష్ యాదవ్, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నరేష్ కుమార్ అగర్వాల్( లల్లు) వైఎస్ఆర్సిపి రాష్ట్ర మైనార్టీ యువజన కార్యదర్శి అన్వేష్, మహాలక్ష్మి నర్సింగ్ హోమ్ వ్యవస్థాపకులు డాక్టర్. ఉలాల కోదండరాం, వైయస్సార్సిపి బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, వైఎస్ఆర్సిపి మహిళా విభాగం నాయకురాలు ఉలాల భారతి దివ్య, ఇచ్ఛాపురం ఏఎంసీ మాజీ ఛైర్ పర్సన్ ప్రతినిధి చాట్ల తులసీదాస్ రెడ్డి, సోంపేట జడ్పిటిసి ప్రతినిధి తడక యశోద జోగారావు, వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి పూడి నేతాజీ, వైసిపి నేతలు నర్తు ప్రేమ్ కుమార్, డాక్టర్ బి. త్రినాథ్ రెడ్డి, బడగల బాలయ్య, బర్ల నాగభూషణరావు, పొడుగు కామేష్, సర్పంచులు, ఎంపీటీసీలు , వైయస్సార్సిపి ముఖ్య నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# "1033 హైవే సహాయం"

హైవేపై ప్రయాణం... సురక్షితంగా సాగాలి
సమస్య వస్తే వెంటనే... సహాయం అందాలి
ఫోన్‌లో ఒక నంబర్... గుర్తు పెట్టుకోండి
వెంటనే డయల్ చేయండి... వన్ జీరో త్రీ త్రీ (1033) ??

గుంతలు కనిపిస్తే... వెంటనే చెప్పండి
వీధి దీపం లేకపోతే... వెంటనే తెలపండి
టోల్ సమస్య వచ్చినా... స్పష్టంగా అడగండి
హైవే సేవలు వస్తాయి... త్వరగా, సులభంగా ????

ప్రమాదం జరిగితే... అంబులెన్స్ వస్తుంది
హైవే పెట్రోల్ గాడీ... వెంటనే చేరుతుంది
క్రేన్ కూడా వచ్చి... వాహనం తొలగిస్తుంది
ప్రయాణికుల రక్షణ... మొదటగా చూస్తుంది

ఫాస్ట్‌ట్యాగ్ సందేహం... ఉంటే అడగండి
సహాయం కావాలంటే... వెంటనే కాల్ చేయండి
రోజంతా సేవలు... ఇరవై నాలుగు గంటలు
హైవే ప్రయాణానికి... ఇది మంచి బాటలు

ప్రయాణం సుఖంగా... సురక్షితంగా ఉండాలి
హైవేలో సహాయం... అందరికీ చేరాలి
గుర్తుంచుకోండి నంబర్... అందరికీ చెప్పండి
హైవే హెల్ప్‌లైన్ 1033... వెంటనే ఉపయోగించండి ??



**తేరాల రాజేంద్ర ప్రసాద్ గుప్తా**
రత్న లహరి ఛానల్ సీఈవో
9297109223 సికింద్రాబాద్

# కానిస్టేబుల్స్‌కు ప్రథమ చికిత్సపై అవగాహన




**నవతరం-ఎచ్చెర్ల**

ఎచ్చెర్ల మండలం ఎచ్చెర్ల నందు ఉన్న ఆర్మీడ్ రిజర్వ్ ఫోర్స్ ఆఫీస్ ఆవరణములో కానిస్టేబుల్స్ కు ప్రథమ చికిత్స, CPRపై ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించబడినది. ఆర్మీడ్ ఫోర్స్ డిఎస్పి శేషాద్రి శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రథమ చికిత్స పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలని కాపాడుకోవచ్చు అన్నారు. డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రథమ చికిత్స అవగాహన కలిగి ప్రమాదాల జరిగిన చోట సహాయ కార్యక్రమాల అందించిన ఎడల ప్రాణ నష్టాన్ని తగ్గించవచ్చు అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ రిసోర్స్ పర్సన్స్ కె. సత్యనారాయణ, పి చైతన్య కుమార్ ప్రథమ చికిత్స, కృత్రిమ శ్వాస, తరలించు విధానాలు, సి పి ఆర్ చేయు విధానం, యాంటీ షాక్ పొజిషన్ తదితర అంశాలను బోధించడం అయినది. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాసరావు, కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థలో మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్లో పెద్దపీట

### ఏ పి విద్యా సంక్షేమ మౌలిక వసతుల కార్పొరేషన్ డైరెక్టర్ పి ఏం జె బాబు




**నవతరం – శ్రీకాకుళం**

ఈ రోజు సర్వ శిక్ష ఏ పి సి వేణుగోపాలరావు, డి ఇ ఓ, రవిబాబు లతో విద్యాలయాల్లో మౌలిక వసతులు కల్పనపై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా డైరెక్టర్ పి ఏం జె బాబు మాట్లాడుతూ గత వైకాపా ప్రభత్వ పాలనలో విద్యా వ్యవస్థనిర్వీర్యం అయిపోయిందని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ రెండేళ్ల కాలంలో విద్యా,ఐ టీ శాఖామాత్యులు నారా లోకేష్ విద్యా వ్యవస్థను పటిష్టపరిచి ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని తెలిపారు . ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో విద్యకు 32,235 కోట్లు కేటాయించడం గర్వించదగ్గ విషయం. అందులో 1500 కోట్లు విద్యాలయాల్లో మౌలిక వసతులకోసం కేటాయించడం శుభ పరిణామం. మన రాష్ట్రంలో చేపట్టిన విద్యా సంస్కరణలు పట్ల కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యా శాఖ మంత్రి లోకేష్ ను ప్రశంసిస్తూ, ఇతర రాష్ట్రాలు కూడా ఆంధ్రప్రదేశ్ విద్యా సంస్కరణలు పరిశీలించాలని సూచించారని తెలిపారు.వైకాపా ప్రభుత్వం లో దేశంలో 21 స్థానానికి దిగజారి భ్రష్టు పట్టుపోయిన విద్యా వ్యవస్థను దేశంలో 5 వ స్థానానికి తీసుకురావడానికి విద్యా శాఖ మంత్రి లోకేష్ పట్టుదలతో ఉన్నారు. ఉపాధ్యాయులు, తలిదండ్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా బాధ్యత తీసుకోవాలని సూచించారు. జిల్లాలో విద్య, సంక్షేమ సంస్థలలో మౌలిక వసతులు కల్పనకు పనులు జరుగుతున్నాయి.పెదపాడు, నందిగాం, కంచిలి, మందస లలో డా బి ఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో మౌలిక వసతుల పనులు అభివృద్ధి పదం లో ఉన్నాయని తెలిపారు. విద్యాలయాల్లో ఇంకనూ అవసరమైన మౌలిక వసతులు కల్పనకోసం ప్రతిపాదనలు పంపాలని ఏ పి సి, డి ఇ ఓ లను కోరారు.

# జీడి పిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలి.!

**నవతరం-హరిపురం**



మందస మండలం హారిపురం లో మార్పు ట్రస్టు గ్రంధాలయంలో రైతాంగ సమస్యల సాధన కమిటీ అధ్యక్షులు మామిడి మాధవరావు అధ్యక్షతన జీడి పిక్కల గిట్టుబాటు ధర కై సమావేశం నిర్వహించడం జరిగింది.
ప్రస్తుతం జీడి పంట పూత, పిందె దశ లో ఉన్నందున వ్యవసాయ ఉద్యానవన అధికారులు ఉద్దాన జీడి రైతాంగానికి సూచనలు, సలహాలు ఇవ్వాలని, ప్రభుత్వం కలుగజేసుకుని చీడ పీడలను గుర్తించి అవసరం అయిన చోట క్రిమిసంహారక మందులను, పిచికారి యంత్రాలను ఉచితంగా అందించాలని రైతాంగ అవసరాలు తక్షణమే పరిష్కరించాలని సమావేశానికి హాజరైన రైతాంగ కమిటీ సభ్యులు కోరడమైనది .
కూటమి ప్రభుత్వం జీడి రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పిస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చలని డిమాండ్ చేశారు. తక్షణమే వ్యవసాయ శాఖ మంత్రి కలుగజేసుకుని మద్దతు ధర కల్పించి పరిష్కరించాలని కోరడమైనది.
ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలైన జీడి రైతాంగ సమస్యలు పరిష్కారం కానందున ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్లోకి తీసుకెళ్తామని ,పరిష్కరమైనంతవరకు పోరాడతామని రైతాంగ కమిటీ సభ్యులు చెప్పడం జరిగింది.
డిమాండ్స్ :
80 కేజీ ల జీడిపిక్కల బస్తాకు 18,000 లకు కొనుగోలు చెయ్యాలి. జీడి పంటకు కొనుగోలు కేంద్రాలును ఏర్పాటు చేసి ప్రభుత్వమే కొనుగోలు చెయ్యాలి. జీడి,కొబ్బరి పంటలకు రాష్ట్ర ప్రభుత్వంమే ప్రత్యేకంగా బోర్డులను ఏర్పాటు చెయ్యాలి. వంశధార ఎడమ కాలువ యాపోడు చెరువునుండి అనుసంధానం చేస్తూ ఇచ్చాపురం వరకు పొడిగించాలి .
రైతాంగానికి ఎరువులు, పురుగుమందులు ,పిచికారి యంత్రాలను ,వ్యవసాయ పనిముట్లను 50% సబ్సిడీ పై అందివ్వాలని కోరుతూ రైతాంగ సమస్యల సాధన కమిటీ . మామిడి మాధవరావు అధ్యక్షుడు గొర్లే చలపతి, దాసరి శ్రీరాములు, తమాడ త్రిలోచన, కొర్ల హేమరావు చౌదరి, పి దుర్యోధన, కొమర వాసు, భర్త కామేశ్వరరావు, కె తవిటయ్య , హడ్డి మాస్టారు, బి సింహాద్రి, ఏం ధర్మారావు, డి వీరాస్వామి, ఆర్ చిన్నారావు, నాగమణి, ధనలక్ష్మి ,సోమనాథం , పురుషోత్తం, లింగమూర్తి, టి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగ సమస్యలు పరిష్కరించండి

### రైతాంగ సమస్యల సాధన కమిటీ అధ్యక్షుడు మామిడి మాధవరావు

**నవతరం-మందస**



మందస మండలం హరిపురంలో జీడి రైతుల సమస్యలపై రైతాంగ సమస్యల సాధన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. హరిపురంలోని మార్పు ట్రస్ట్ గ్రంథాలయంలో జరిగిన ఈ సమావేశానికి కమిటీ అధ్యక్షుడు మామిడి మాధవరావు అధ్యక్షత వహించారు. ప్రస్తుతం జీడి పంట పూత, పిందె దశలో ఉన్నందున వ్యవసాయ మరియు ఉద్యానవన శాఖ అధికారులు ఉద్దానం ప్రాంత జీడి రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని సమావేశంలో రైతులు కోరారు. చీడపీడలను గుర్తించి అవసరమైన చోట ప్రభుత్వమే క్రిమిసంహారక మందులు, పిచికారీ యంత్రాలను ఉచితంగా అందించాలని, జీడి కొబ్బరి ఆధారిత పరిశ్రమలను నెలకొల్పే వలసల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి జీడి కొబ్బరి మామిడి మునగా మొక్కలను రైతులకు ఉచితంగా అందజేయాలని వడ్డీ లేని రుణాలను జీడి కొబ్బరి రైతులకు ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు.రైతుల అవసరాలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం జీడి రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పిస్తామని ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రైతులు కోరారు. వ్యవసాయ శాఖ మంత్రి తక్షణమే కలుగజేసుకుని జీడి పంటకు మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలనిస్త్ర విజ్ఞప్తి చేశారు. 80 కిలోల జీడి పిక్కల బస్తాకు రూ.18,000 ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని, జీడి పంటకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జీడి, కొబ్బరి పంటలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలని కూడా కోరారు. అలాగే వంశధార ఎడమ కాలువను యాపోడు చెరువుతో అనుసంధానం చేస్తూ ఇచ్చాపురం వరకు పొడిగించాలని, రైతులకు ఎరువులు, పురుగుమందులు, పిచికారీ యంత్రాలు మరియు వ్యవసాయ పనిముట్లు 50 శాతం సబ్సిడీపై అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా జీడి రైతుల సమస్యలు పరిష్కారం కాలేదని, సమస్యలు పరిష్కరించే వరకు ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తూ పోరాటం కొనసాగిస్తామని రైతాంగ కమిటీ సభ్యులు తెలిపారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్న నాయుడు జిల్లా కలెక్టర్ రైతాంగ సాధన కమిటీ ప్రతినిధిలో కలిసి రైతాంగ సమస్యతో కూడిన వినతి పత్రాన్ని అందజేస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో గొర్లే చలపతి, దాసరి శ్రీరాములు, తామాడ త్రిలోచన, కొర్ల హేమరావు చౌదరి, పి. దుర్యోధన, కొమర వాసు, కామేశ్వరరావు, కె. తవిటయ్య,నల్ల హడ్డి మాస్టారు, బి. సింహాద్రి, ఎం. ధర్మారావు, డి. వీరాస్వామి, ఆర్. చిన్నారావు, నాగమణి, ధనలక్ష్మి, బ.సోమనాథం, పురుషోత్తం, లింగమూర్తి, టి. గంగయ్య, డి.నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లు కాలిపోయిన కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి...

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్

**నవతరం- జలుమూరు**



జలుమూరు మండలం అందవరం పంచాయతీ రామకృష్ణాపురంలో గత పది రోజులకు ముందు వాడాన రాజు, వాడానా భోగమ్మ, మారెళ్ళ ఎర్రయ్య కుటుంబాల ఇల్లు కాలిపోవడం జరిగిందని అయినప్పటికీ ప్రభుత్వ అధికారులు పరిశీలన చేయకపోవడం దురదృష్టకరమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్ అన్నారు. ఈరోజు బాధితులతో కలిసి ఆ గ్రామాన్ని ఆయన సందర్శించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ తక్షణమే కాలిపోయిన ఇళ్లకు నష్టపరిహారం ప్రభుత్వం అందించాలని, నియోజకవర్గ శాసనసభ్యులు వెంటనే స్పందించి ప్రభుత్వం తరపున ఇల్లు నిర్మించుకోవడానికి కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా 4 లక్షల రూపాయలు ప్రభుత్వం ఇల్లు నిర్మించుకోవడానికి బాధిత కుటుంబాలకు సాయపడాలని కోరారు. అదేవిధంగా ఇల్లు కాలిపోవడంతో వారి జీవన భృతి దెబ్బతిందని, అన్యార్థులుగా మిగిలిపోయారని, కుటుంబాల ప్రజలు కట్టుబట్టలతో మిగిలిపోయి తినడానికి తిండి లేక ఆకలితో అలమటించే పరిస్థితి ఉండడం వలన ఎవరికి సహాయం అడగాలో తెలియక నిరాశ్రయులుగా మిగిలిపోయారని ఆయన అన్నారు. వెంటనే ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు స్పందించి ఇల్లు కాలిపోయిన కుటుంబాల పక్షాన అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నౌపాడు అప్పారావు పాల్గొన్నారు

# మహిళ దినోత్సవ గోడ పత్రిక ఆవిష్కరణ

**నవతరం-శ్రీకాకుళం**




భారత ప్రభుత్వం యువజన వ్యవహారములు మరియు క్రీడలు మంత్రిత్వ శాఖ మేరా యువ భారత్ మరియు జిల్లా క్రీడా సాధికారిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 8వ తేదిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కోడి రామ్మూర్తి స్టేడియం యందు అస్మిత అథ్లెటిక్స్ కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఒ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ శ్రీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఐ.ఎ.ఎస్. గోడపత్రిక ఆవిష్కరణ చేసారు. మార్చి 8న జరుపుకొనే ఈ దినోత్సవం మహిళల హక్కులు సామాజిక ఆర్ధిక విజయాలను గుర్తు చేస్తుందని, మహిళల రక్షణ, విద్య, సాధికారతను పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలియజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ క్రింది క్రీడలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈవెంట్స్ వివరములు:100మీటర్లు, 200మీటర్లు, 400మీటర్లు, పరుగు పందెం ఉంటుందని, టగ్ అఫ్ వార్ ఒ మోర్ క్రీడలు ఆడేందుకు ఉత్సాహవంతులైన 13సంవత్సరాలు నిండినవారు, 13-18 సంవత్సరాల లోపు, 18-25 సంవత్సరాలు లోపు వయసు ఉన్న యువతులకు క్రీడా పోటీలు నిర్వహిస్తామని ఆన్ లైన్ లో nsrs.kheloindia.gov.in ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారి ద్వారా పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్ ఆన్ లైన్ లో వస్తుందని ప్రతి విభాగంలో టాప్ ముగ్గురు విజేతలకు పథకాలు ప్రధానం చేయబడతాయని తెలియజేశారు. అర్హతలు ఉన్న బాలికలు మరియు మహిళలు ఉత్సాహంగా పాల్గొని ఆన్ లైన్ లో అంతీం.ఎష్ట్రవశ్రీ.శీఱఅఎఖు.ఠ్రశీజ.ఱఅ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో భాగంగా అసిస్టెంట్ కలెక్టర్గా దొనక పృథ్వీరాజ్కుమార్, మేరా యువ భారత్ గణాంక అధికారి మరియు కార్యక్రమ సహాయకులు డి.శ్రీనివాసరావు, శ్రీరామ యువజన సేవా సంఘం అధ్యక్షులు యస్.వి.వి. సత్యనారాయణ, మేరా యువ భారత్ వాలంటీర్ అరుగుల దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**